# రజనీకాంతరావు

శ్రీ పురిపాక జగన్నాథరావు

మొన్న సాయంత్రం పట్టుదల మారి రజనీకాంతరావుకు వొక పక్క నా భర్త కూర్చున్నారు. వారికిదగ్గరగా నేను కూర్చున్నాను. తను అనుకొన్నది సాధించందే నిద్రపోని రజనీకాంతరావుకు మరోపక్కగా సూర్యనారాయణమూర్తి కూర్చున్నాడు. అతని దగ్గరగా కళాధరం తలక్రింద చేయి పెట్టుకుని అడ్డంగా పడుకున్నాడు. వారికి కళాధరం దగ్గర చాలా చనువు. మరి కళాధరం చాలా అమాయకుడు. అతను ఎవరేమన్నా, తప్పు తనదైనా, కాకపోయినా, ఎవరు తనను ఎందుకు మాటలంటున్నారో కారణమైనా తెలుసుకోకుండా, అతనిని మైదుచేశే వాళ్లవలలో చాలా సులువుగా, చేపకన్న సులువుగా పడిపోతాడు. అలాంటి సమయాలలో అతను మెదలక తలవంచుకు కూర్చుంటాడు. సూర్యనారాయణమూర్తి అభిమాని. స్నేహానికి ప్రాణం విడుస్తాడు కాని పల్లెత్తుమాట పడడు. మరి ఇక రజనీకాంతరావు వెనుకటి విషయం మొన్న సాయంత్రానికి పూర్వపు వృత్తాంతం— చెప్పమంటారా!

చిన్నప్పుడు వేళాపాళాలేకుండా రజనీకాంతరావు ఎక్కడా అంతూ పంతూ లేని కోరికలు కోరి, వాటిని సాధించే నిమిత్తం తల్లిదగ్గర తగని మారాం చేశేవాడు. అతని కోరికలకు, పట్టుదలకు వాటిని సాధించే నిమిత్తం చేశే అల్లరికి హద్దూపద్దూ ఉండేది కాదు. ఇల్లూ వాకిలీ, పొలమూ పుట్రా ఉన్నవాళ్లు కదా అని అతని తల్లి కష్టాన్ని అప్పటిలో మనంతక్కువ చేయటానికి వీల్లేదు. దేనికంటే అతనికోరికలు ఎప్పుడూ, ఇప్పటికీ అప్పటికీ అంతూ పంతూ లేనివే. కాని నాటికీ నేటికీ ఒక్కటే భేధం. ఇప్పటికీ కోరే కాంతా, పట్టుదలా ఏ కొంచెం, ఏ కోశానా తగ్గకపోయినా, ఒక ఏడుకంటే మరో ఏడు పైబడినకొద్దీ తల్లి బాధ్యత తగ్గిపోనారంభించింది. దీనికి ఆ తల్లి ఎన్ని దేవుళ్లకు మొక్కుకుందో చెప్పటం కష్టం. కొడుకుపైన ప్రేమ ఆవగింజంత తగ్గకపోయినా, ఆమె కొడుకు ప్రవర్తనతో పూర్తిగా విసుగు చెందింది.

పూర్వమైతే తల్లి రెండువిధాల దెబ్బలు తింటూ ఉండేది. తీరా ఎంతో శ్రమపడి రజనీకాంతరావు కోరికను తీరుస్తే, అతను ఆ వస్తువును ఒక్క క్షణంలో నాశనంచేసి, ఆ పర్యవసానానికి తల్లే కారణ మంటూ ఆమెపైన పడి గోల చేశేవాడు. ఇప్పుడు రజనీకాంతరావు తన కోరికలను తీర్చుకునే విషయంలో తనకు తనే ఆలోచించు కుంటాడు. ఆ కష్ట నష్టాలకు బాధ్యత వహించేది అతనే.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే ఆ పట్టుదలతో బాధపడేది కాని, సుఖపడేది కాని అతనే. పూర్వం అతని తల్లి చాలా కష్టాలకు గురయిన మాట వాస్తవమే కాని, ఆమెకూడా కొడుకు కోరికలను తీర్చటంలో కాస్తో కూస్తో ఆనందాన్ని పొందకపోలేదు. ఏమైనా ఆమె అతని తల్లి. ఆమె తన శ్రమను, కష్టాన్ని మనకు చెప్ప రాలేదు. పైగా ఆమె తన కొడుకు పట్టుదలను నవ్వుతూ ఇప్పటికీ వర్ణిస్తూ ఉంటుంది. కనుక మనం ఆవిషయాన్ని విస్మరించే రజనీకాంత రావు శీలాన్ని విమర్శిద్దాము. చదువు సంధ్యల విషయంలో, ఆట పాటల విషయంలో, అందచందాల విషయంలో నిజానికి రజనీకాంతరావు ఎంతో చక్కని వాడు. అతను తన నల్లటి వెంట్రుకల్ని పచ్చని నుదుటిమీద నుంచి ఎప్పుడూ పైకి తీసుకుంటూ ఉంటాడు. రజనీకాంతరావు తాను మహా పెద్దమనిషిలాగా పాపాయికి బుద్ధులు బోధిస్తూ ఉంటాడు. తల్లితండ్రుల్ని దయతో చూడక కష్టపెట్టడం మహా చెడు అని విజ్ఞునిలాగా చెప్పే రజనీకాంతరావును చూసి, నేను ఆపశక్యంగాని నవ్వుతో చీరకొంగును నోట్లో కుక్కుకుంటూ ఉంటాను. అదిగో, మీ రడుగుతున్నారు. ఇరవై రెండేళ్ల రజనీకాంతరావు పెళ్లి విషయం. దీనికి నేను నవ్వుతూ సమాధానం ఇస్తాను. దేనికండీ ఆ వచ్చే పిల్ల పుటం ఆర్పటానికి తప్ప అని. మొన్న సాయంత్రం పట్టుదల మారి రజనీకాంతరావును వొకపక్క నా భర్త కూర్చున్నారు. వారికి దగ్గరగా నేనుకూర్చున్నాను.

మేము సామాన్యంగా సాయంకాలాలను గడపేది ఊరిబయట ఉన్న ఒక మైదానంలో. మైదానానికి ఒకప్రక్కగా రైలుమార్గం ఉన్నది. అప్పుడు ప్రకృతి ఆకాశంలో పెద్దపెద్ద భావాలను అట్టేపెట్టుకున్న దానిమల్లే బొమ్మలను చిత్రిస్తోంది. దూరంగా కనబడే కొండల మధ్య నీలపు ఆకాశంలో ప్రత్యక్ష దైవం, తేజో అయిన సూర్యుడు కనీ కనబడక మరుగుపడుతున్నాడు. ఊళ్లో దీపాలు వెలిగించి నిచ్చెన భుజాన పెట్టుకు పోతున్నాడు చాకలివాడు. అతగాడు ఆఖరి దీపాన్ని వెలిగించి తిరిగి పోవటం దూరంగా మాకు కనబడుతోంది. మృత్యువు కౌగిలికి పోయే తొందర నడకల బాటసారి ముఖం ఎలా ఉంటుందో అలా ఉంది వాతావరణం. కొంచం దూరాన స్మశానంలో ఎవరో మనిషి తగలబడిపోతున్నాడు. అతని భార్య వేదనతో ఏడుస్తున్నది. ఎవరో చల్లగాలికోసం షికారుకు వచ్చిన విద్యార్థి స్నేహితులతో గొర్రెల కాపరిని చూసి ఇలా అంటున్నాడు:—
'ఇది 'నాది' అనే భావన లేకపోవటాన్ని సమర్థిస్తూన్న దేశదిమ్మరితనం మాటల్లోను, చేతల్లోను బంధిఖానాలను ఏర్పరుచుకునే నాగరికతా ప్రపంచానికి అంతగా పరిచయం లేకుండా దూరంగా ఉండటం, శాశ్వత నిద్రతోబాటు మామూలు నిద్రలనుకూడా పట్టుపరుపులమీద గాక భూమిమీదే గడపటం—ఇలాంటి సంగతులేనాకు అతనినిచూసి సంతోషించటానికి సహాయపడుతున్నై.'

నిత్యం పొద్దస్తమానమూ వాగే రజనీకాంతరావు మొన్న సాయంత్రం చిత్రంగా ఏమీమాట్లాడలేదు. అంతకంటె చిత్రంగా ఉన్నట్టుండి హారొరయిజన్ వంక చూస్తూ ఇలా అన్నాడు :— 'భూమీ, ఆకాశమూ కలిసే చోటును చూడాలని ఉంది?

నాకెందుకో ఆక్షణాన అతనిని, అతని మాటలను చూస్తే అసహ్యంవేసింది. నేను నా ఆపేక్షను కనబర్చ ఏమీ ప్రయత్నం చేయలేదు సరికదా దాన్ని పూర్తిగా కప్పివేశాను. నేను అతని ముఖంవంకకూడా చూడలేదు. అసలు మామూలుగా అంతగా మాట్లాడని ఆయనే కొంచం మాట్లాడారు. ఒకళ్లమీద ప్రేమనుగాని, అయిష్టతనుగాని దేన్నీ వ్యక్తం చేయలేని కళాధరం కొంచం తడబడుతూ చూశాడు. సూర్యనారాయణ మూర్తి ఇలా అన్నాడు :— 'ఇంతవరకు, నీకు తెలుసునో లేదో, నీమీద, ముఖ్యం నీ పట్టుదలమీద నాకెంతో ఇష్టం. నాకు ఒకళ్లమాట అంటేమాత్రం సహించే శక్తి ఉండదు. దానికనే ఒకళ్లను ఏమీ అనను. కాని నాకు దేనికో ఇప్పుడు నీ మాటలను వింటూంటే ...' తరువాత మాటలను సూర్యనారాయణమూర్తి పూర్తిచేయ దలచనూలేదు. రజనీకాంతరావు వినదలచనూ లేదు. అతను అందరివంకా అమిత ఆపేక్షతో చూశాడు. 'నువ్వు చెప్పు కమలా' అని నాభర్తనాతో అన్నారు కాని ఆయన మాటలను నేను ఆచరణలో పెట్టలేక పోయాను.

రజనీకాంతరావు లేచి నిలబడ్డాడు. అతను సిగ్గుపడుతూ ముఖం పక్కకితిప్పుకుని ఇలా అన్నాడు అందరితో :—'మా అమ్మ చాలా కాలంనుంచీ కాశీ వెళ్లాలనుకుంటుంది. ఆమెను మీరు కాశీకిపంపి కనిపెట్టి ఉండండి. నిజానికి మిమ్మల్ని వదిలిపెట్టి పోవటానికి కష్టంగానేఉంది. కాని నా తలంపును తృప్తి బరచకపోతే నాకు నిద్రపట్టదుగా! అతను బ్యాటరీని దూరంగా వేస్తూ చప్పున నా వంకకు తిరిగి 'పాపాయిని ఏలా ఓదార్చమని నీకు చెప్పాలో నాకు తెలీటం లేదు' అన్నాడు. తరువాత అతను గబగబ వెళ్లిపోయాడు ఆ చీకట్లో.

• • •

మొన్న అలా వెళ్లిపోయిన రజనీకాంతరావును గురించి ఏమనుకోవాలి! చెట్టంత కొడుకులు, కూతుళ్లే పోతుంటారు. రజనీకాంతరావును తమ్ముడే అన్నా ఉన్నా ఈ కలికాలంలో అంతకంటే ఎక్కువా ఏమిటి? పోయేవాళ్లు పోతుంటారు. మనం ఎంత భరింపరాని కష్టాన్నైనా భరిస్తూ మనస్సు చెడగొట్టుకోకుండా మన మరణకాలంవరకు ఎలాగో ఒకలాగు బ్రతకాలి కదా! ఈ విధమైన మొండి ఊరడింపుతో నే నీమాటలంటున్నాను కాని మీరు నన్ను కటిక దాన్ని అనబోకండి. ఐనా పెద్దవాళ్లు బ్రతకగా చిన్నవాళ్లు పోవట మేమిటి? ఏమైనా ఈ రెండు రోజులే పాపాయిని ఓదార్చడం కష్టమై పోతూన్నది. రజనీకాంతరావు

దానికి చెప్పకుండా ఊరు విడిచి పోవటం ఇదే మొదటిసారి. చిన్నపిల్లలకు మనకంటె ఎక్కువ హృదయం ఉంటుందేమో! పాపాయి తన దూదుంపుల్ల, ఉప్పుప్పుగోను, కాల్లాగజ్జా స్నేహితుడికోసం నిన్నల్లా ఎదురు చూసింది. ఐనా 'చందమామ రావే' పాటకు అన్నం తినక వేధించే పాపాయి రజనీకాంతరావు తినమని సైగచేయగానే గప్‌చిప్‌గా తినేది ఇప్పుడెలా అడగకుండాను, ఎదురు చూడకుండాను ఉంటుంది! 'నాకు చెప్పకుండా ఎక్కడికిపోయాడు మామయ్య?' అని వేధించే పాపాయిని ఎలా ఓదార్చాలో నాకు తెలీటం లేదు. బుద్ధిమంతులైన మీరైనా చెప్పరాదా! మరి దయవుంచి తప్పక చెబుతారు కదా!—నిజానికి నాకు బాధను చూస్తే ఉన్నంత భయం మరణాన్ని చూస్తే లేదు. అదీ గాక రజనీకాంతరావు విషయం వేరు. నా దృష్టిలో అతనిది ఒక ఖరీదైన పిచ్చితో కూడిన తత్వం. అతని విషయమై విచారం ఉండక బోదు గాని రోజువారీ సమస్యలను ఎదుర్కోవాలి కదా! అటువంటప్పుడు తరుచుగా మాలాంటి మధ్యతరగతి బీదవాళ్లకు బ్రతకటమే ఒక విధమైన బాధగా ఉంటుందేమో! ప్రపంచంలో డబ్బున్న మనిషికి ఆరోగ్యం ఉండదు. ఆరోగ్యం ఉన్న మనిషికి డబ్బుండదు. రెండూ ఉన్న మనిషికి పిల్లలను గురించిన బాధో, తల్లితండ్రుల్ని గురించిన బాధో ఉంటుం దనుకుంటాను.

చిత్రం! చాలా చిత్రంగాను, నమ్మ శక్యంగాకుండాను, ఎంతో పట్టరాని సంతోషకరంగాను ఉంది. సరిగా మూడు రోజుల తరువాత— ఇవ్వాళే— రజనీకాంతరావు వచ్చాడు. అతను ఈ ఒక్క ముక్క మాత్రం చెబుతున్నాడు. ఎవరో సాధువుతో తన కథంతా చెప్పి, మాట్లాడిన తరువాత అతను ఆ సాధువు నచ్చచెప్పిన విధంగా తన అభిప్రాయాన్ని మార్చుకున్నాట్ట మొట్ట మొదటిసారిగా. ఐతే అతని ఖరీదైన పిచ్చి తన పొలిమేరనూ, సరిహద్దునూ గుర్తించిందన్న మాట! ఆ సాధు వెవరో, ఆయన చాలా విజ్ఞాని ఐ ఉంటాడు తప్పక. సందేహం లేదు. ఏమీ లేకుండా ఇంత మార్పు ఇంత వెంటనే మనిషిలో కలగటం అసంభవం. ఈ మూడు రోజుల తన కథంతా సాయంత్రం మేము కూర్చునే ఊరిబయట మైదానంలో మా అందరితో చెబుతాట్ట రజనీకాంతరావు! —అప్పుడే పాపాయితో దూదుంపుల్ల ఆడుతున్నాడు రజనీకాంతరావు ...'మనం చెయ్యాల్సిన పని చాలా ఉంది. కాని కాలంమాత్రం పరిగెత్తుకు పోతూంది. పాపా, త్వరత్వరగా నేను చెప్పే మెలుకువలను నేర్చుకో, నిన్ను అరుణా అసఫాలీ అంతటిదాన్ని చేస్తాను' అంటున్నాడు రజనీకాంతరావు గుండె నిబ్బరం ప్రబోధించే ఏదో పాఠాన్ని పాపాయికి చెబుతూ. మరి మీరు రజనీకాంతరావు సాయంత్రం చెప్పే విషయాల్ని తెలుసుకోవాలంటే తప్పక మైదానానికి రాండి, విందురు గాని!